515) ముఖారి

ప|| అతడే గతియని యనుటే నన్నిటా మాన్యుడు | ఇతరాలు మానగానే యీతనికే శలవు ||

చ|| శ్రీరమణునినిత్యసేవకులకు దొల్లె | వేరులేనికర్మముల పెట్టిమాన్యము |
ఆరీతి నితనిభక్తులైనచనవరులకు | ఆరితేరి పుణ్యపాపా లడ్డపాటు లేదు ||

చ|| తక్కక యితనిముద్ర ధరించినదాసులకు | చొక్కుల భవబంధాలసుంక మాన్యము |
లెక్కించ నితనికైనలెంకలకు బొడుకల- | కొక్కట విధనిషేధా లూహింప లేవు ||

చ|| సరుస శ్రీవేంకటేశుశరణాగతులకును | పరగ మాయలదొడ్డిబందె మాన్యము |
పరమమైనయితనిపళ్ళెముకూటివారికి | ధరలో నేమిటివంకా దప్పులే లేవు ||